క్లుప్తంగా

గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి



పాతకొత్తచెరువులో సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్వాతి సూచించారు. దంచర్ల, పాతకొత్తచెరువు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ సిబ్బంది కౌలు రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ కౌలు రైతు కార్డులతో కలిగే ఉపయోగాలను వివరించారు. పొలం బడి కార్యక్రమంలో భాగంగా కంచె పంటలు, ఆకర్షక పంటలపై అవగాహన కల్పించారు. విత్తన మోతాదు, విత్తనశుద్ధి, పంటయాజమాన్య పద్ధతులు తదితర అంశాలను వివరించారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



బేకరీలో తనిఖీలు చేస్తున్న కమిషనర్

గుత్తి రూరల్: పట్టణంలోని వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలో కమిషనర్ శానిటేషన్, నీటి సరఫరా డ్రైవ్, ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎల్ఎస్ బెంగళూరు బేకరీ, టీ స్టాళ్లలో కమిషనర్ తనిఖీ చేపట్టారు. టీ స్టాళ్లు, దుకాణాల ముందు ఉన్న డ్రైనేజీ కాలువలను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. బేకరీ ముందు నిర్లక్ష్యంగా చెత్త పడేసిన నిర్వాహకుడికి రూ.2 వేలు జరిమానా విధించారు. దుకాణాలు, టీస్టాళ్ల ముందు రోజు వెలువడే చెత్తను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బుట్టల్లో మాత్రమే పడేయాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని దుకాణాల యజమానులు ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, దుకాణాల యజమానులు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

గుత్తి రూరల్: మునిసిపాలిటీ పరిధిలో సచివాలయ కార్యదర్శుల ద్వారా గురువారం ఉదయం 6 గంటల నుంచి సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో కమిషనర్ మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని 12 సచివాలయాల్లో 4,571 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. రూ.2.04 కోట్ల పింఛన్ సొమ్మును లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తామన్నారు. గురువారం ఒక్క రోజే 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న గుత్తి ఎక్సైజ్ సీఐ, పోలీసులు

యాడికి: నాటుసారా తయారీ స్థావరాలపై గుత్తి సీఐ ఎక్సైజ్ సీఐ శివసాగర్ తన సిబ్బందితో దాడులు నిర్వహించి బెల్లం ఊటను ధ్వంసం చేశారు. వివరాలు.. కేశవరాయునిపేట సమీపంలోని కొండల్లో బుధవారం నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో గుత్తి ఎక్సైజ్ సీఐ దాడులు చేశారు. నాటుసారా తయారు చేసే బట్టీ వద్ద గల రెండు ఇనుప డ్రమ్ములు, నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ములలో ఉన్న 1000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎక్సైజ్ పోలీసుల రాకను గమనించి సారా తయారీదారులు పరారయ్యారు.

ప్రతిరైతు శాస్త్రవేత్తగా మారాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ చెంగల్‌రాయుడు

పెద్దపప్పూరు: పంటల సాగులో రైతులు శాస్త్రవేత్తగా మారాలని తాడిపత్రి ఏడీఏ చెంగల్‌రాయుడు పేర్కొన్నారు. బుధవారం సోమనపల్లిలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంటల సాగుకు ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. పంటల సాగులో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఆంజనేయులు, వీఏఎలు సతీష్ బాబు, రవితేజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నంబర్ లేదు.. ప్లేటూ లేదు!

- వాహనాలకు ఇష్టారాజ్యంగా నంబర్ ప్లేట్ల ఏర్పాటు
- కొన్ని వాహనాలకు ప్లేట్లే లేని వైనం
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు

తాడిపత్రి రూరల్: ద్విచక్ర వాహనదారులు నిబంధలను తుంగలో తొక్కుతున్నారు. వాహనాలకు వెనుక, ముందు భాగంలో నంబర్ ప్లేట్లకు రవాణాశాఖ కేటాయించిన నంబర్లు కనిపించడం లేదు. వాటి స్థానంలో తమకు ఇష్టం వచ్చినట్లు సిక్కర్లను అతికించుకుంటున్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై దర్జాగా తిరుగుతున్నా రవాణా, పోలీసు శాఖలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.

నిబంధనలకు నీళ్లు..

నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనదారులు రవాణశాఖ అధికారులు కేటాయించిన నంబర్లను ముందు, వెనుక భాగంలో ఏర్పాటు చేసుకోవాలి. వాటిని కూడా అనుమతించిన ఫాంట్, సైజులో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. అయితే చాలా మంది ద్విచక్ర వాహనదారులు నంబర్ ప్లేటు ఏర్పాటు చేసుకోవడం లేదు. వాహనాలకు నంబర్ ప్లేట్‌పై ఒకటి, రెండు నంబర్లు మాత్రమే పెద్దవిగా మరో రెండు నెంబర్లతో పాటు సీరీస్‌ను కనిపించని చిన్నవిగా తయారు చేయించుకుంటున్నారు. ఇలాంటి వాహనాలను నడిపే వారి చేష్టలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. కొందరు వాహనాలకు నంబర్లు లేకుండా పోలీసు, రెవెన్యూ అని నంబర్ ప్లేట్లపై రాయించుకుంటున్నారు. ఆదర్శంగా ఉండాల్సిన ఉద్యోగులే నిబంధనలు ఉల్లంఘించడం విమర్శలకు తావిస్తోంది.



నంబర్ ప్లేట్ లేని వాహనాలు







వాహనాల నంబర్ ప్లేట్లపై ఉన్న వివిధ రకాల స్టిక్కర్లు

ప్రమాదాలు జరిగితే గుర్తించడం కష్టమే..

తాడిపత్రి ప్రాంతం మూడు జిల్లా సరిహద్దుగా ఉంటోంది. ఇక్కడ రోజూ వందలాది ద్విచక్ర వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. నంబర్ ప్లేట్ లేని వాహనాలు ప్రమాదాలకు కారణమైతే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నంబర్ ప్లేట్ లేని వాహనాల ద్వారా నేరాలకు పాల్పడితే నిందితులను పట్టుకోవడం కష్టమే. ఇప్పటికైనా రవాణా, పోలీసు అధికారులు ఇలాంటి వాహనాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

స్పెషల్ డ్రైవ్ చేపడతాం



నంబర్ ప్లేట్లు లేని వాహనాలతో పాటు నంబర్ ప్లేట్ల స్థానంలో రకరకాల సిక్కర్లను అతికించిన వారి కోసం స్పెషల్ డ్రైవ్ చేపడతాం. అవసరమైతే జరిమానాలు, కేసులు నమోదు చేస్తాం. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధలకు అనుగుణంగా ప్లేట్లపై నంబర్లను రాయించుకోవాలి. ఇలాంటి వాహనాలు దొరితే స్వాధీనం చేసుకొని వారి చేత స్టిక్కర్లను తొలగించి నంబర్లను వేయిస్తాం.

– శ్రీనివాసులు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

వాహనాలు స్వాధీనం చేసుకుంటాం



తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో రోడ్లపై తిరుగుతున్న నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, స్టిక్కర్లు మాత్రమే వేయించుకుని తిరుగుతున్న వాహనాలను స్వాధీనం చేసుకుంటాం. అలాంటి వాహనదారులకు కౌన్సెలింగ్ కూడా ఇస్తాం. ఇప్పటికైనా అలాంటి వారు నిబంధనలు పాటించాలి.

– లక్ష్మీకాంతరెడ్డి, అప్‌గ్రేడ్ రూరల్ సీఐ

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు: రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్‌మెన్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన డివిజన్ ప్రధాన కార్యదర్శి వీ.సుంకప్పతో కలిసి డీఆర్ఎం విజయ్‌కుమార్, సీనియర్ డీపీఓ జయశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లతోపాటు ఫ్యామిలీ పెన్షనర్లకు 7వ పే కమిషన్ తర్వాత ఇవ్వాల్సిన పెన్షన్ పే ఆర్డర్లను అందించాలన్నారు. అర్హులందరికీ యూఎంఐడీ మెడికల్ కార్డులు ఇవ్వాలన్నారు. ఇక మ్యానువల్ పాసులను మంజూరు చేయడంతోపాటు రెఫరల్ ఆస్పత్రిలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంతక ముందు ఫెడరేషన్ కార్యాలయంలో పెన్షనర్స్ డివిజనల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ సెక్రటరీ యుగంధర్, డివిజనల్ ప్రెసిడెంట్ డాక్టర్ జయంత్‌కుమార్, కోశాధికారి డాక్టర్ వీరన్న, ఏడీఎస్ సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్ఎంకు సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న ఫెడరేషన్ నాయకులు

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

గుత్తి రూరల్: ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తేనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్ఎస్ చెట్నేపల్లి గ్రంథాలయాధికారి ఆస్పిరి వేణుగోపాల్ రాయుడు, కోట జెడ్పీహైస్కూల్ ఉపాధ్యాయుడు చాగంటి లింగన్న ఉద్యోగ విరమణ చేయడంతో బుధవారం వారిని సన్మానించారు. ఆయా కార్యాక్రమాల్లో గ్రంథాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమ్మన్న, జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, హెచ్ఎం సుభాన్ ఉపాధ్యాయులు నాగరాజు, రఘు, శేషాద్రి, గ్రంధాలాయాధికారిణి హేమలత, విశ్రాంత గ్రంథాలయాధికారి ఏసీ.సుబ్బన్న పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రతి ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌బాబు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు పేర్కొన్నారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఆదినారాయణ ఉద్యోగ విరమణ చేయడంలో బుధవారం స్థానిక పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు.

గార్లదిన్నె: ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న నాగభూషణ ఉద్యోగ విరమణ చేయడంతో బుధవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంఈఓ చంద్రనాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోట పాఠశాలలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

అండర్-16 అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపిక

గుత్తి రూరల్: స్థానిక ఆర్ఎస్ పత్తికొండ రోడ్డులో ఉన్న సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు విక్టర్, మనోజ్ అండర్-16 అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం ఎజిలరాసి, కరస్పాండెంట్ రెజీనా తెలిపారు. బుధవారం వారు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్‌లో హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జిల్లా అండర్-16 జట్టు తరఫున ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచారన్నారు. దీంతో నిర్వాహకులు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారన్నారు. పీఈటీ రంగనాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులలో హెచ్ఎం, పీఈటీ

చెన్నకేశవస్వామికి కామిక ఏకాదశి పూజలు



అలంకరణలో చెన్నకేశవస్వామి

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం కామిక ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కామిక ఏకాదశి వశిష్టతను తెలియజేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



పాండురంగస్వామి భజనబృందం గీతాపాలన ఘనంగా ఏకాదశి పూజలు

పామిడి: పట్టణంలోని చిన్న వితోబ ఆలయంలో బుధవారం ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం భజనబృందం భక్తి సంకీర్తనాలాపనల నడుమ దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు. ఈసందర్భంగా ఆలయం జై వితల నామస్మరణతో మార్మోగింది.

డాక్టర్ ఎల్లప్ప సేవలు ప్రశంసనీయం

పామిడి: స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యాధికారిగా ఎల్లప్ప సేవలు ప్రశంసనీయమని వక్తలు అన్నారు. డాక్టర్ ఎల్లప్ప పదోన్నతిపై గుత్తికి వెళ్తుండటంతో బుధవారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో ఆయన పదోన్నతి వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వక్తలు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం వైద్యాధికారి ఎల్లప్ప దంపతులను ఆసుపత్రి సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వైద్యులు శివకార్తీక్ రెడ్డి, కిరణ్మయి, మహేష్, కమలాకర్, రాఘవేంద్ర రెడ్డి, ఆయుర్వేద వైద్యురాలు కృష్ణవేణి, ఫిజియోథెరపిస్ట్ పద్మలత, హెడ్ నర్సు శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



పామిడిలో వైద్యాధికారి ఎల్లప్పను సన్మానిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పింఛన్ల పంపిణీపై సమీక్ష



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పెద్దవడుగూరు : సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని 1వ తారీఖునే పూర్తి చేయాలని ఎంపీడీఓ గోపీకృష్ణ సచివాలయ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 7,706 పింఛన్లు ఉన్నాయని ఇందుకోసం ప్రభుత్వం రూ.3,45,97,000 మంజూరు చేసిందన్నారు. పింఛన్ల పంపిణీ నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఐకేపీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: గ్రామ సచివాలయం సిబ్బంది ద్వారా గురువారం లబ్ధిదారుల ఇంటి వద్దే వెళ్లి పింఛన్లు అందజేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 7,872 మంది లబ్ధిదారులకు పింఛన్ మొత్తం మంజూరైందన్నారు. మొదటి రోజే వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు.

కమనీయం.. గిరిజా కల్యాణం

అనంతపురం కల్చరల్: శ్రీరామకృష్ణ సేవా సమితి 20వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మూడవ రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలు వేదికగా సాగుతున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు బుధవారం ముగిశాయి. ఉదయం సాయిట్రస్టు ఆధ్వర్యంలో శ్రీశైలం, తిరుమల, అలంపూర్ క్షేత్రాల నుంచి విచ్చేసిన వేదపండితులతో కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ పర్యవేక్షణలో రుత్వికులు అమ్మవారి సారె సమర్పించారు. గురు దంపతులనే శివపార్వతులుగా భావించి సారె సమర్పించి, ఒడిబియ్యాన్ని భక్తులే స్వయంగా నివేదించారు. సాయంత్రం శ్రీనృత్యకళానిలయం సంధ్యామూర్తి శిష్యబృందం శివపదం నృత్యరూపకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. 28 మంది కళాకారులు కైలాసంలోని వివిధ దేవతామూర్తుల వేషధారణలతో చేసిన నాట్య విన్యాసాలు ఆకట్టుకున్నాయి. షణ్ముఖశర్మ శివసాక్షాత్కారం అనే అంశంపై మహేశ్వరుడి లీలావిశేషాలను తెలియజేసి ప్రవచనాలను ముగించారు. అనంతరం నిర్వాహకులు ప్రవచనకర్తను, కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్జి శోభారాణి, రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు డాక్టర్ కృష్ణశశి, ప్రవీణ్‌కుమార్, శ్రీధరమూర్తి, విజయ్‌సాయి, బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనిధి రఘు, ఇన్నర్‌వీల్ సంస్థ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయండి

యల్లనూరు: అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. బుధవారం ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా ఎమ్మెల్యే మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైంది. అధికారులు ఆయా శాఖల ప్రగతిని చదివి వినిపించారు. మండలంలో తాగునీటి సమస్యపై నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుప్రజారెడ్డికి సూచించారు. కృష్ణాపురం రోడ్డు అధ్వానంగా ఉందని, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జెడ్పీటీసీ భోగాతి విజయప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. బీసీహాస్టల్‌లో వసతులపై నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే ఎంపీడీఓ, ఎంఈఓలను ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణశ్రీ

6న అశ్వత్థంలో బహిరంగవేలం

పెద్దపప్పూరు: అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కు, హోటల్ నిర్వహణ హక్కు కోసం ఈనెల 6న బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈఓ సుబ్రమణ్యం బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాఘమాసం మినహా మిగిలిన రోజుల్లో పై వాటికి అనుమతి ఉంటుందని తెలిపారు. రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఎల్కేపీలో రేపు బళ్లారి రాఘవ జయంతి

అనంతపురం కల్చరల్: అనంత రంగస్థలానికి విశేష ఖ్యాతి తెచ్చిన మహనీయుడు బళ్లారి రాఘవ 144వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు లలిత కళాపరిషత్తు కార్యదర్శి పద్మజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్కేపీలో ఈనెల 2న సాయంత్రం 5:30 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలతో పాటూ పలువురు అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై బళ్లారి రాఘవ అవార్డులకు ఎంపికైన వారిని పురస్కారాలతో ఘనంగా సత్కరిస్తారని తెలిపారు. ఈసారి రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి అవార్డులతో పాటూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కన్నుల పండువగా సాగుతాయని కళాభిమానులందరూ విచ్చేయాలని కోరారు.

పరికరాల పంపిణీ



పరికరాలు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్‌నాయక్

శింగనమల: కల్లుమడి గ్రామంలో ఎముకలలో పటుత్వం తగ్గిన వారికి తరిమెల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్.శంకర్‌నాయక్ పరికరాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ కార్యక్రమం కింద ఎముకల్లో పట్టుత్వం తగ్గిన వారికి ప్రభుత్వం ఉచితంగా సపోర్టింగ్ పరికరాలు అందిస్తోందన్నారు. అర్హులు తమ పేర్లను ఆయా ఆరోగ్య ఉపకేంద్రాల్లో నమోదు చేయించుకుంటే లంబార్ బెల్ట్స్, వాకర్స్, హ్యాండ్ స్టిక్స్ అందిస్తామని తెలిపారు. హెల్త్ ప్రొవైడర్ శ్వేత, ఏఎన్ఎం మోహనమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం



ధనుష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: గార్లదిన్నె వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వరికూటి ఓబుళపతి కుమారుడు వరికూటి ధనుష్(18) అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి బుధవారం మార్చురీలో ఉన్న ధనుష్ మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన ఓబుళపతితోపాటు ఆయన కుటుంబ సభ్యులను ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలుగా ఉంటామని భరోసా ఇచ్చారు. పలువురు నాయకులు, దళిత సంఘాల నాయకులు ఆస్పత్రికి చేరుకుని సంతాపం తెలియజేశారు. ధనుష్ కళ్లను తల్లితండ్రులు దానం చేశారు.

పంపింగ్‌కు ఏర్పాట్లు చేయండి



అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ రమణయ్య

గుంతకల్లుటౌన్: హంద్రీనీవా కాలువ ద్వారా ప్రవహిస్తున్న కృష్ణాజలాలను సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల్లోకి పంపింగ్ చేయడానికి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఇంజినీర్లకు సూచించారు. బుధవారం కమిషనర్, ఎంఈ గురప్పయాదవ్ పంప్‌హౌస్, సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు, ఇన్‌లెట్, ఔట్‌లెట్లను పరిశీలించారు. పంపింగ్ మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సక్రమంగా పని చేసేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. డీఈ హేమచంద్ర, ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలి

శింగనమల: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం శింగనమలలోని వసతిగృహాల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు బాలు, విజయ్, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు రుణాలు ఇవ్వాలి

పెద్దపప్పూరు: చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ కోరారు. ఈమేరకు ఏపీజీబీ మేనేజర్ బొజ్జన్నకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎంతో మంది చిరు వ్యాపారులు పెట్టుబడికి డబ్బు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారికి రుణాలు మంజూరు చేస్తే వ్యాపారం చేసి కంతులను సకాలంలో చెల్లిస్తారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు గార్లదిన్నె కంబగిరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు సీడీపీఓ ఉమా శంకరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తల్లి బిడ్డ సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.